క్లుప్తంగా

చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

కేసముద్రం : ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎస్సై మురళీధర్ రాజు అన్నారు. గురువారం మండలంలోని కల్వల మోడల్‌స్కూల్‌లో పోలీసుల ఆధ్వర్యంలో చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆడపిల్లలు ఎలాంటి ఆపదలో ఉన్నా వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



కురవి: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం అని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి వీరభద్రం అన్నారు. గురువారం మండల కేంద్రంలో డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితిలో పెద్ద ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకున్న వారికి సీఎంఆర్‌ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతున్నదని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు అవిరె మోహన్‌రావు, శ్రీనివాస్, బాదె వీరభద్రం, తుకారాం నాయక్, భద్రయ్య, సుధాకర్, రవీందర్ పాల్గొన్నారు.

జేవీవీ మండల కమిటీ ఎన్నిక




అధ్యక్ష,కార్యదర్శులు సుందర్‌కుమార్, శ్రీనివాస్

గార్ల: జనవిజ్ఞాన వేదిక మండల కమిటీని మండల కేంద్రంలో జరిగిన మండల మహాసభ అధ్యక్షుడు ఆర్‌వీ ప్రసాద్ అధ్యక్షతన గురువారం జరిగింది. సమావేశంలో అధ్యక్షుడిగా మాచర్ల సుందర్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా యూ.శ్రీనివాస్‌లను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్సై ఎస్.జీనత్‌కుమార్, సలహాదారుడిగా ఎడ్ల అప్పయ్య, ఉపాధ్యక్షుడిగా జి వీరన్న, సహాయ కార్యదర్శిగా ఎం.దేవేందర్‌రెడ్డి, చెకుముకి కన్వీనర్‌గా జె వీరస్వామి, కల్చరల్ కన్వీనర్‌గా డి శ్రీను,కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

అనుమతి తప్పనిసరి

కురవి: సీరోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణనాథుల ప్రతిమలను ప్రతిష్ఠించే ప్రతీ ఒక్కరు పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్సై నగేష్ గురువారం అన్నారు. ప్రతిష్ఠించే ముందు పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

డీటీఎఫ్ సభ్యత్వ నమోదు

కొత్తగూడ: మండలంలోని పలు పాఠశాలల్లో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నెల్లుట్ల భాస్కర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం గతంలో చేసిన ఉద్యమాలను, ఇక ముందు చేయబోయే కార్యాచరణను వివరించారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, పొట్టయ్య, ప్రభాకర్, జుమ్మిలాల్, సుధాకర్, కోటేశ్వర్, నర్సింహరావులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను నిలిపివేయాలి

నెహ్రూసెంటర్ : ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్‌కు అప్పగించే కుట్రలను నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని నున్ననారాయణనగర్‌లో పార్టీ సమావేశం రజాక్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సమావేశంలో రాజమౌళి, ప్రవీణ, ఉపేంద్ర, కళావతి, రోహెనా, శ్రీనివాస్, మధు, కృష్ణ, చారి పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

కొత్తగూడ: గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ పార్టీపై అభిమానం ఉన్న ప్రతీ వ్యక్తికి సభ్యత్వం అందాలని అన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

బయ్యారం: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానంను అమలు చేసి కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ మండల అధ్యక్షుడు రవీందర్‌నాయక్ అన్నారు. గురువారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుడారు. దస్తగిరి, రవి, విజయ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

బయ్యారం : పోగొట్టుకున్న సెల్‌ఫోన్ ఆచూకీ కనుగొని సెల్ యజమానికి అప్పగించిన సంఘటన గురువారం బయ్యారంలో చోటుచేసుకుంది. మండలంలోని నాగారంతండాకు చెందిన భూక్య శివ గత నెల 23న సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. శివ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆచూకీ కనుగొని అందజేశారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

షరతులు లేకుండా రైతులకు రూ. 2 లక్షల రుణ మాఫీని ప్రభుత్వం చేయాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆ పార్టీ మండల కమిటీల ఆధ్వర్యంలో గురువారం రైతులు ఆయా తహసీల్దార్ల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేవలం 40 శాతం మంది రైతులకు మాత్రమే రుణ మాఫీ జరిగిందని, కొందరికి రుణమాఫీ సొమ్ము బ్యాంకులో పడకపోవడంతో రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. అర్హులకు రుణమాఫీ అందేంతవరకు రైతుల పక్షాన పోరాడుతామని పేర్కొన్నారు. సీపీఎం,సీపీఐ, న్యూడెమోక్రసీ, ప్రజాపంథ మాస్‌లైన్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



తొర్రూరు : ఆందోళన చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు



కురవి : తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు



నెల్లికుదురు : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు



దోర్నకల్: ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కొత్తగూడ: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎస్సై కుశకుమార్ సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.

మరిపెడ రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చాలని మండలంలోని తానంచర్ల జెడ్పీఎస్ఎస్ హెచ్‌ఎం అనిత అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని తానంచర్ల ఉన్నత పాఠశాలకు చెందిన యాసారపు లాస్య రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబర్చింది.

ప్రతి విద్యార్థి ఒలంపిక్స్ స్థాయికి ఎదగాలి

నెల్లికుదురు: ప్రతి విద్యార్థి ఆటల పోటీల్లో ఒలంపిక్స్ స్థాయికి ఎదిగేవిధంగా పోటీ పడాలని హెచ్‌ఎం రవి సూచించారు. జెడ్పీహెచ్ఎస్‌లో హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

కురవి: మండలంలోని సూదనపల్లిలోని ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం దరావత్ వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే కురవిలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో పీడీని సన్మానించారు.

క్రీడలపై ఆసక్తి అవసరం

తొర్రూరు: క్రీడలపై ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శాట్ ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు, షటిల్ క్రీడాకారులకు లయన్స్ క్లబ్ ఆఫ్ టీచర్స్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, శాట్ అధ్యక్షుడు తీగల కృష్ణారెడ్డి, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, పీడీ ప్రవీణ్‌రెడ్డి, పాల్గొన్నారు.



కొత్తగూడ : మాట్లాడుతున్న ఎస్సై కుశకుమార్

తొర్రూరు రూరల్: చదువుతో పాటు క్రీడలపై విద్యార్థులు ఆసక్తిని పెంపొందించుకోవాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు కోరారు.

మహబూబాబాద్ రూరల్ : మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం క్రీడాపోటీలు నిర్వహించారు.హెచ్‌ఎం సక్రు, పీడీ మోహన్ నాయక్, పాల్గొన్నారు.

దంతాలపల్లి : దేశం పేరును ప్రపంచ నలుమూలలు చాటిన గొప్ప క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ అని సామాజిక వస్తా సేను రాజేష్ అన్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పెద్దవంగర: హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో గురువారం జాతీయ క్రీడ దినోత్సవం పురస్కరించుకొని గురవారం ధాన్యచంద్ చిత్రపటానికి హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పూల మాల వేసి నివాళులర్పించారు.

గ్రామాల్లో వైద్యశిబిరాల ఏర్పాటు



గార్ల : శిబిరంలో జ్వరపీడితులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

సాక్షి ఎఫెక్ట్..

గార్ల: 'విజృంభిస్తున్న విషజ్వరాలు' అనే శీర్షికన బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి వైద్యులు, వైద్య సిబ్బంది స్పందించి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ముల్కనూరు పీహెచ్‌సీ పరిధి లోని గార్ల, సీతంపేట, పోచారం గ్రామాల్లో వైద్యులు, సిబ్బంది వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి జ్వరపీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారి నుంచి రక్త సమూనాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. శిబిరాల్లో సీహెచ్‌ఓ సక్కుబాయి, హెచ్‌ఈ ఓ శ్రీహరి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: మండలంలోని పురుషోత్తమాయగూడెం, ఎలమంచిలితండ గ్రామపంచాయతీ పరిధిలోని ఇటుకలగడ్డ తండాలో మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలను గురువారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాల ద్వారా సుమారు 150 మందికి రక్త నమూనాలు సేకరించి వారందరికి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

లాలుతండాలో వైద్యశిబిరం

కేసముద్రం: ఇనుగుర్తి మండలంలోని లాలుతండా జీపీలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. మెడికల్ ఆఫీసర్ సురేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 51 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, రక్తనమూనాలను సేకరించారు. 10 మంది జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు కృష్ణకుమారి, ఏఎన్ఎం కవిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దవంగర: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో మండలంలోని పోచారంలో గురువారం వైద్య శాఖ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. గ్రామంలో మొత్తం 43 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

పీడబ్ల్యూ మహాసభలను జయప్రదం చేయండి

● సంఘం జిల్లా నాయకురాలు రజిత

నెహ్రూసెంటర్ : ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) రాష్ట్ర 7వ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా నాయకురాలు సామ రజిత పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని విక్రంనగర్ కాలనీలో మహాసభల వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి, విద్య, వైద్యరంగాలతో పాటు పురుషులతో సమానంగా అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో పీఓడబ్ల్యూ ఉద్యమిస్తుందన్నారు. ఈనెల 31న ఇందిరాపార్క్ వద్ద బహిరంగ సభకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

మహబూబాబాద్: శుభోదయం సాహిత్య, సాంస్కృతిక , సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గురువారం ఘనంగా తెలుగు వ్యవహారిక భాషా దినోత్సవం నిర్వహించారు. ముందుగా ఆచార్య గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సంస్థ అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కాంతారావు, రాజేంద్ర ప్రసాద్, పుష్పరాజ్, కవిత, రమ్య, వినీదర, దీపిక పాల్గొన్నారు.

డోర్నకల్: డోర్నకల్‌తో పాటు పలు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం తెలుగు భాషాదినోత్సవం ఘనంగా జరిగింది. మన్నెగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో డీఈఓ రాజేశ్వర్‌రావు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేశారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కేసముద్రం విలేజ్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగుభాషా దినోత్సవాన్ని, ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడాదినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.

గార్ల: స్థానిక డిగ్రీ కళాశాలలో వెంకటరామమూర్తి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజు మాట్లాడుతూ సామాన్య ప్రజలకు అర్థమయ్యే విధంగా తెలుగు భాష వ్యవహారిక ప్రజల భాషలో ఉండేందుకు ఆయన చేసిన కృషిని కొనియాడారు.



దోర్నకల్ : రామమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీచర్లు, విద్యార్థులు

కురవి: మండలంలోని సూదనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. హెచ్‌ఎం ధరావత్ వెంకన్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దంతాలపల్లి : జన్మనిచ్చిన మాతృమూర్తిని, జన్మతో వచ్చిన మాతృభాషను ఎప్పుడు మరవద్దని హెచ్‌ఎం కృష్ణయ్య అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామయ్య, ప్రేమ్‌కుమార్, విజయ్‌కుమార్, రమేష్, మాధవి, సునిత తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని అయోధ్యపురం, తీగలవేణి ఉన్నత పాఠశాలల్లో గురువారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, సాహిత్య పోటీలను నిర్వహించారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

మహబూబాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి ఒకటోవార్డులో పాథమిక చికిత్స కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సిజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండాలని, మంచి చికిత్స అందించి మనోధైర్యం నింపాలన్నారు. విధులకు హాజరుకాని వైద్యులను, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు.

'పది'లో ఉత్తీర్ణత సాధించాలి

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలను గురువారం ఎమ్మెల్యే సందర్శించి మాట్లాడారు.



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్

విద్యార్థులు కష్టపడి ఇష్టపడి చదవాలని, ప్రభుత్వ పాఠశాలలోనే ఉత్తమ ఉపాధ్యాయులు బోధిస్తారన్నారు. 10లో జీపీఏ సాధించిన విద్యార్థులందరికి నగదు బహుమతి, మెమెంటో అందజేస్తామన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం వెంకటేశ్వర్లు ఉన్నారు.

క్రైం కార్నర్

అప్పులబాధతో రైతు బలవన్మరణం



పెద్దల పాపయ్య (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసినా.. సరైన దిగుబడి రాకపోవడంతో పాటు అప్పుల పాలైన ఓ రైతు గురువారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలంలోని నడివాడ గ్రామానికి చెందిన రైతు పెద్దల పాపయ్య (54)కు మూడు ఎకరాల సొంత వ్యవసాయ భూమి ఉండగా మరో రెండు ఎకరాలు భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. గతఏడాది మిర్చి, వరి సాగు చేయగా మిర్చికి తెగుళ్లు సోకి దిగుబడి రాకపోగా.. పెట్టుబడి కూడా రాలేదు. చేసిన అప్పులు అలాగే ఉండగా ఈ ఏడాదైనా కాలం కలిసి వస్తుందేమో అనుకుని మూడు ఎకరాల్లో మిర్చి, రెండు ఎకరాల్లో వరి పొలం సాగు చేశాడు. పది రోజుల క్రితం మిరప నారు వేసే పనులు మొదలు పెట్టగా ఎండల తీవ్రత కారణంగా నారు పూర్తిగా ఎండిపోయింది. దీంతో పాపయ్య మనోవేదనకు గురయ్యాడు. రెండేళ్ల పంట సాగునకు సుమారు రూ.7 లక్షల వరకు అప్పు కాగా అప్పులు ఎలా తీరుతాయని మనస్తాపానికి గురై గురువారం తన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తోటి రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు చికిత్స నిమిత్తం మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పాపయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య సారమ్మ, కుమారులు సంపత్, సందీప్ ఉన్నారు.

సాక్షిని బెదిరించిన కేసులో నేరస్తుడికి రెండేళ్ల జైలు

మహబూబాబాద్ రూరల్ : ఓ హత్య కేసులో సాక్ష్యం చెప్పేందుకు వచ్చిన వ్యక్తిని నేర్తుడు బెదిరించిన కేసులో నేరం నిరూపణకాగా అతడికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మహబూబాబాద్ సీనియర్ సివిల్ జడ్జి సి.సురేశ్ గురువారం తీర్పు ఇచ్చారు. కోర్టు డ్యూటీ అధికారి బీరం సంపత్ రెడ్డి కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన కుసుమ రంజిత్ రెడ్డి, వసంత దంపతుల కుమారుడు దీక్షిత్ రెడ్డిని హత్య చేసిన ఘటనలో మందసాగర్ అనే వ్యక్తి నిందితుడిగా ఉన్నాడు. దీక్షిత్ రెడ్డి హత్య కేసు విషయమై మహబూబాబాద్ జిల్లా కోర్టులో ట్రయల్స్ నడుస్తున్న క్రమంలో మందసాగర్ కోర్టుకు హాజరైన తరుణంలో గతేడాది ఫిబ్రవరి 28వ తేదీన కుసుమ వసంత సాక్ష్యం చెప్పేందుకుగాను కోర్టు వచ్చింది. ఆ సమయంలో సాగర్ ఆగ్రహంతో వసంతను చంపుతానని బెదిరించాడు. దీంతో ఆమె అదే రోజున మహబూబాబాద్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి టౌన్ ఎస్సై శీలం రవి కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంతోషిణి కోర్టులో వాదనలు వినిపించగా సీడీఓ సంపత్ రెడ్డి సాక్షులను ప్రవేశపెట్టారు. వాదనలు విన్న సీనియర్ సివిల్ జడ్జి సురేశ్.. నేరం నిరూపణకాబడిన మందసాగర్కు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన బొలెరో ఐదుగురికి తీవ్రగాయాలు..



మహబూబాబాద్ రూరల్ : అతి వేగంతో వచ్చి అదుపు తప్పిన కోళ్ల బొలెరో వాహనం రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. జిల్లా కేంద్రంలోని కురవి రోడ్ అయ్యప్పనగర్ సమీపంలోని 365వ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ఈప్రమాదానికి సంబంధించి, టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు మండలంలోని ఊట్ల మట్టెవాడ గ్రామం నుంచి కోళ్ల కొనుగోలు చేయడానికి బొలెరో వాహనం జనగాం వెళ్తుతుంది. ఈక్రమంలో అయ్యప్పనగర్ సమీపంలో అతి వేగంతో వచ్చి ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. అంతటితోఆగకుండా రెండు ద్విచక్ర వాహనాలను ఈడ్చుకుంటూ వెళ్లి పక్కనే ఉన్న సాయి నగర్ ఫీడర్ 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో బొలెరో డ్రైవర్ పగడయ్య, క్లీనర్ సైదులు, కురవికి చెందిన జంగాల సంతోష్, సాలార్ తండాకు చెందిన ధారవత్ వీరన్న, ఆయన భార్య ఝాన్సీకి తీవ్రగాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి, పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచివడంతో విద్యుత్ శాఖ డీఈ విజయ్ సరఫరా పురుద్ధరణ పనులు చేపట్టారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

తొర్రూరు: పెద్దవంగర మండలానికి చెందిన ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం తొర్రూరు పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు...పెద్దవంగర మండలం అవుతాపురం గ్రామానికి చెందిన బుర్రి రమ అనే వివాహిత భర్తతో గొడవ పడి గత ఐదేళ్ల నంచి వేరుగా ఉంటోంది. గురువారం వ్యక్తిగత పని నిమిత్తం తొర్రూరుకు వచ్చిన రమ పట్టణంలోని వాటర్ ట్యాంకు సమీపంలో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. గమనించిన స్థానికులు మంటలు ఆర్పివేశారు. అప్పటికే 30 శాతం మేర కాలిన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనాన్ని పిలిపించి పోలీసు సిబ్బంది సహాయంతో ఎంజీఎంకు తరలించారు. అవుతాపురం గ్రామానికి చెందిన షబ్బీర్‌కు అవసరం నిమిత్తం రమ డబ్బులు, బంగారం ఇచ్చిందని, అది తిరిగి ఇవ్వాలని కోరగా అతనితో గొడవ జరిగిందని, దీంతోనే వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని స్థానికులు భావిస్తున్నారు. రమ ఆత్మహత్యాయత్నంపై కారణాలు తెలియాల్సి ఉందని, ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై ఉపేందర్ తెలిపారు.

అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి

బయ్యారం: అపరిచిత వ్యక్తులతో పాటు వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే లింకులతో జాగ్రత్తగా ఉండాలని గార్ల-బయ్యారం సీఐ రవికుమార్ సూచించారు. మండలంలోని నామాలపాడులోని ఏకలవ్య పాఠశాలలో సైబర్‌క్రైమ్‌పై జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కైకన్ ఆదేశాల మేరకు నిర్వహించిన అవగాహన సదస్సును ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వ్యక్తిగత విషయాలను కాని వ్యక్తిగత ఫోటోలను సోషల్‌మీడియాలో షేర్ చేయొద్దన్నారు.

ఆర్థికసాయం అందజేత

చిన్నగూడూరు: మండల కేంద్రానికి చెందిన చిత్తారి సోమన్న గత కొన్ని నెలలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 1990–91 పదో తరగతి బ్యాచ్‌కు సంబంధించిన మిత్రులు గురువారం మండల కేంద్రంలోని వారి నివాసానికి వెళ్లి మిత్రుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అతని కుటుంబానికి రూ. 50 వేలు ఆర్థికసాయం అందజేశారు.

రైతులు అధైర్యపడొద్దు

దంతాలపల్లి : రేషన్‌కార్డు లేని రైతులు ఎవరూ అధైర్య పడొద్దని మండల వ్యవసాయ అధికారి వాహిని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల అనుసారం మండల కేంద్రంతో పాటు, గున్నెపల్లిలో గురువారం ఆధార్ కార్డుల ప్రక్రియ మొదలు పెట్టారు. ఈ సందర్భంగా ఆమె రేషన్ కార్డులు లేని రైతుల కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డులు పరిశీలించారు.

సంక్షిప్త సమాచారం

రైతురుణమాఫీని సద్వినియోగం చేసుకోవాలి

కేసముద్రం : రేషన్‌కార్డులేని అర్హులైన ప్రతి రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయించుకుని, రుణమాఫీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహబూబాబాద్ ఏడీఏ అజ్మీరా శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం ఉప్పరపల్లిలోని జీపీ కార్యాలయంలో చేపట్టిన రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు.

గిద్దెగళ పోస్టర్ ఆవిష్కరణ

మహబూబాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో గిద్దెగళ పోస్టర్‌ను టీజేఎస్ అధికార ప్రతినిధి డాక్టర్ డోలి సత్యనారాయణ గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తొర్రూర్‌లో ఈ నెల 31న గద్దరన్న అవార్డు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథులుగా సినీదర్శకనిర్మాత ఆర్.నారాయణమూర్తి, ప్రొఫెసర్ కాశీం, ప్రజాగాయకులు వెన్నెల, విమలక్క, గోరేటి వెంకన్న, జయరాజులు హాజరవుతారన్నారు.

బీజేపీ పటిష్టతకు కృషి చేయాలి

పెద్దవంగర: బీజేపీ పటిష్టతకు పార్టీ నాయకులు కృషి చేయాలని జనగామ జిల్లా అధికార ప్రతినిధి చింతా సృజన్ తెలిపారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం పార్టీ సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సృజన్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములుగౌడ్, నియోజకవర్గ కన్వీనర్ శ్రీమాన్, పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ జలాలను విడుదల చేయాలి

పెద్దవంగర: ఎస్సారెస్పీ జలాలను విడుదల చేయాలని మండలంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని పోచంపల్లిలో సాగు చేసిన వరి పొలాలు ఎండిపోతున్నాయని పేర్కొంటూ నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని పోచంపల్లితో పాటు గంట్లకుంట, ఉప్పరగూడెం, అవుతాపురం గ్రామాల్లోని వందలాది ఎకరాల్లో పంట సాగు చేశామని, నేటి వరకు సాగు నీరు అందక పొలాలు ఎండి పోతున్నాయన్నారు.

వివరాలు క్షుణ్ణంగా పరిశీలించాలి

దంతాలపల్లి : కుటుంబ సభ్యుల వివరాలు క్షుణంగా పరిశీలించి ఓటరు జాబితా తయారు చేయాలని ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. మండలంలోని తూర్పుతండాలో చేస్తున్న ఓటరు లిస్టు ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యుల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి ఒకే చోట చేర్పించట్లెతై ఎన్నికల ముందు ఎలాంటి తప్పిదాలకు, చికాకులకు చోటు ఉండదని తెలిపారు.

నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించాలి

కురవి: నితావ్యవర వస్తువుల ధరలను ప్రభుత్వం నియంత్రించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి డిమాండ్ చేశారు. గురువారం కురవిలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

దాతలు సహకరించాలి

మహబూబాబాద్ అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, వ్యాపారవేత్తలు సహకరించి అభివృద్ధి చేసుకోవాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్, 22వ వార్డు కౌన్సిలర్ బి. అజయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కంకరబోర్డు రామాస్ ఉర్దూ మీడియం పాఠశాల ప్రధాన గేట్, అంగన్వాడి సెంటర్‌కు ఫ్యాన్లు బహూకరించి గురువారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరై ప్రారంభించారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

చిన్నగూడూరు: మండలంలోని ఆకేరు వాగులో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. ఇసుక రవాణాకు మూడు ట్రాక్టర్లకు మాత్రమే పర్మిషన్ ఇవ్వగా రవాణా మాత్రం వందల సంఖ్యలో సాగుతుందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మహబూ బా బాద్‌కు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. ట్రాక్టర్లకు ఎలాంటి నంబర్‌ప్లేట్ లేకుండా, మైనర్లు ఫోన్‌లో మాట్లాడుతూ మితిమీ రిన వేగంతో ట్రాక్టర్లను నడుపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తహసీల్దార్ మహబూబ్ అలీని 'సాక్షి' వివరణ అడుగగా గురువారం కూపన్లు మూడు ట్రాక్టర్లకు మాత్రమే అనుమతి ఇచ్చినట్లు తెలిపారు.

దేవాలయానికి బోర్డు ఏర్పాటు

మహబూబాబాద్ రూరల్ : సుప్రసిద్ధ చరిత్ర కలిగిన జిల్లా కేంద్రంలోని వేణుగోపాలస్వామి దేవాలయానికి ప్రత్యేకంగా గురువారం బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేవాదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కవిత మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం తెలంగాణ ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో ఉందని తెలిపారు.

దాతల సహకారం అభినందనీయం

డోర్నకల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని జిల్లా విద్యాధికారి రాజేశ్వర్‌రావు తెలిపారు. సీరోలు మండలం మన్నెగూడెం జెడ్పీహెచ్ఎస్‌కు కీర్తిశేషులు కొండపల్లి జగదీశ్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన బంధువులు నూకల నర్సింహారెడ్డి, కొండపల్లి సుధీర్‌రెడ్డి రూ.1.70 లక్షల విలువైన స్మార్ట్ టీవీతోపాటు రెండు కంప్యూటర్లను బహూకరించారు. గురువారం డీఈఓ రాజేశ్వర్‌రావు స్మార్ట్ టీవీ, కంప్యూటర్లను ప్రారంభించారు.

నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

గంగారం : రాష్ట్ర వ్యాప్తంగా కస్తూర్బా గాంధీ స్కూల్ అండ్ కాలేజీలలో పనిచేస్తున్న నాన్ టీ చింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమైక్య (ఐఎఫ్‌టీయూ) మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిళ్లకంటి సూర్యం అన్నారు. గురువారం కస్తూర్బా గాంధీ స్కూల్‌లో నాన్ టీచింగ్ సిబ్బంది తో ఆగస్టు 30న ఛ లో హైదరాబాద్ కరపత్రాలను ఆవిష్కరించారు.